
ప్రజాశక్తి

మంగళవారం 15 ఏప్రిల్ 2025

5

విజయనగరం



క్రికెట్ బెట్టింగ్‌పై కేసు నమోదు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని ఫైర్ స్టేషన్ పక్కన ఉల్లి వీధి వద్ద క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతనిపైన కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఉల్లివీధికి చెందిన బూర్లి వాసు(43)తో పాటు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మరి కొంతమీద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారిలో శేఖర్ (శ్రీకాకుళం), యడ్ల శ్రీను, అప్పలరాజు (ఆనందపురం), నారాయణరావు, ఓబులరెడ్డి, గోల్డు శ్రీను (విజయనగరం) ఉన్నారని తెలిపారు.



బెట్టింగ్‌కు పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసిన పోలీసులు



చేపల వేట నిషేధంతో బోట్లను ఒడ్డుకు చేర్చిన మత్స్యకారులు

చేపలు గుడ్లు పెట్టే సీజన్‌లో ప్రతి ఏడాది సముద్రంలో వేటను నిషేధిస్తుంటారు. దీనిలో భాగంగా ఈ ఏడాది కూడా ప్రభుత్వం చేపల వేటను నిషేధిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 14 వరకు, అనగా 61 రోజుల పాటు వేటను నిషేధించింది. ఈ సమయంలో ఎవరైనా వేటకు వెళ్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు అంటున్నారు. కాని గతేడాది వేట నిషేధ భృతి చెల్లించలేదు. అంతేకాదు, ఇప్పటి వరకు ఈ ఏడాదికి సంబంధించి లబ్ధిదారుల ఎంపిక కూడా కొత్తగా చేపట్టకపోవడం గమనార్హం. దీంతో ఈ రెండు నెలల పాటు తామెలా బతికేదని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు.

నేటి నుంచి
చేపల వేట నిషేధం

- సముద్రంలో 61 రోజులు వేటను నిలిపేసిన ప్రభుత్వం
- తీరప్రాంతంలో నిలిచిపోనున్న 1121 యాంత్రిక బోట్లు
- నిబంధనలు ఉల్లంఘించి వెళ్తే కఠిన చర్యలు
- నేటికీ అందని గతేడాది వేట నిషేధ భృతి

ప్రజాశక్తి-భోగాపురం

చేపలు సంతానోత్పత్తి కోసం ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి రెండు నెలలపాటు గుడ్లు పెడుతుంటాయి. అలాంటి సమయంలో ఈ వేటను ప్రభుత్వం నిషేధిస్తుంది. జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో తీరప్రాంత గ్రామాలు ఉన్నాయి. ఇందులో భోగాపురంలో ఐదు, పూసపాటిరేగ మండలంలో 11 గ్రామాలు ఉన్నాయి. ఈ రెండు మండలాల నుంచి సుమారు 1121 ఇంజిన్ బోట్లు నిత్యం ఈ ప్రాంతంతోపాటు విశాఖ నుంచి వేటకు వెళ్తుంటాయి. ఈ ప్రాంత మత్స్యకారులంతా చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఈ రెండు నెలల కాలంలో వేట లేకపోవడంతో వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం వేట నిషేధ భృతి చెల్లించేది. గత ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరుతో వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారుడుకి వారి బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున జమచేసేది. గత ఏడాది ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ పథకాన్ని అప్పటి వైసిపి ప్రభుత్వం ఇవ్వలేదు. ఈ ఏడాది అందిస్తామని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రకటించినా ఇంత వరకు లబ్ధిదారులను గుర్తించలేదని మత్స్యకారులు అంటున్నారు.

మత్స్య సంపదను పెంపొందించేందుకే..

సముద్రంలో మత్స్య సంపదను పెంపొందించేందుకే రెండు నెలల పాటు ప్రభుత్వం చేపల వేటను నిషేధిస్తుంది. ఈ సమయంలో వివిధ చేప, రొయ్యి జాతులు గుడ్లు పెట్టి తమ సంతానోత్పత్తిని పెంపొందిస్తుంటాయి. ఈ సమయంలో తల్లి చేపలు, రొయ్యిలను రక్షించేందుకు వేటను నిషేధిస్తారు. దీంతో మత్స్య సంపద పెరిగి, తిరిగి మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఉపయోగపడుతుందని అంటున్నారు అధికారులు. అందుకు ఈ సమయంలో మత్స్యకారులెవరూ వేటకు వెళ్లవద్దని చెబుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే..

చేపలు గుడ్లు పెట్టే సమయంలో యాంత్రిక పడవలను సముద్రంలోకి వెళ్లేందుకు అనుమతించరు. ఆంధ్రప్రదేశ్ సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం ప్రకారం ఎవరైనా ఉల్లంఘించి వేటకు వెళ్తే కఠిన చర్యలు తీసుకుంటారు. వేటకు వెళ్తే వారి వద్దనున్న మత్స్యసంపదను స్వాధీనం చేసుకుంటారు. అంతేకాక జరీమానాతో పాటు డీజిల్ రాయితీ, అన్ని రకాల సబ్సిడీ సౌకర్యాలను నిలుపుదల చేస్తారు. మెరైన్ పోలీసులు, కోస్టుగార్డులు, కోస్టల్ సెక్యూరిటీ, నేవీ, రెవెన్యూ, మత్స్యశాఖ అధికారులు నిత్యం పహారా కాస్తుంటారు. కాని ఇంజిన్లు లేని తెప్పల్లో వేట చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇవి కూడా కేవలం తీరం నుంచి ఎనిమిది నాటికల్ మైళ్ల దూరం లోపలే వేట చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

వేట నిషేధ భృతి అందక..

వేట నిషేధ సమయంలో ప్రతి ఏడాదీ ఏ ప్రభుత్వం ఉన్నా వారిని ఎంతో కొంత ఆర్థికంగా ఆదుకునేది. కాని వైసిపి ప్రభుత్వం వచ్చాక వేటకు వెళ్లే ప్రతీ మత్స్యకారుడికి రూ.10 వేలు చొప్పున మత్స్యకార భరోసా పేరుతో అందజేసేది. భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లో మొత్తం 3522 మందికి అందజేశారు. ప్రతి ఏడాది మే నెలలో ఈ పథకాన్ని అమలు చేసేవారు. గత ఏడాది ఎన్నికలు ఉండడంతో లబ్ధిదారులకు అందజేయలేదు. ఇంతలో వైసిపి ఓడిపోగా, కొత్తగా టిడిపి కూటమి అధికారంలోకి వచ్చింది. గత ఏడాదికి చెందిన భృతి ఇప్పటికీ ఇవ్వలేదు. ఈ ఏడాదికి కొత్తగా లబ్ధిదారుల ఎంపిక కూడా చేపట్టకపోవడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.



వలలు అల్లుతున్న మత్స్యకారులు

అంబేద్కర్ స్ఫూర్తితో
అత్యున్నత స్థాయికి ఎదగాలి

- విద్యార్థులకు పిలుపునిచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- ఘనంగా బాబాసాహెబ్ 134వ జయంతి
- నివాళులర్పించిన ప్రముఖులు



అంబేద్కర్‌చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర మంత్రి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి

ప్రజాశక్తి-విజయనగరం

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని దేశం గర్వించే స్థాయికి ఎదగాలని కోరారు. భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134వ జయంతోత్సవాన్ని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ జంక్షన్ (బాలాజీ జంక్షన్) వద్దనున్న బాబాసాహెబ్ విగ్రహానికి ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్య ద్వారానే అత్యున్నత స్థానానికి చేరుకోవచ్చునని స్పష్టం చేశారు. దీనికి అంబేద్కర్ మహనీయుని జీవితమే ఉదాహరణ అని పేర్కొన్నారు. నేడు బడుగు బలహీన వర్గాలకు విద్య, సమానత్వం, రిజర్వేషన్లు, వివిధ సంక్షేమ పథకాలు, హక్కులు అందుతున్నాయంటే, అది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం చలవేనని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్రను అధ్యయనం చేసి, స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందడుగు వేయాలని మంత్రి కోరారు.

ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, అంబేద్కర్ కేవలం దళితులకే కాకుండా సమాజంలోని ప్రతి ఒక్కరికి ఆదర్శనీయులని కొనియాడారు. తనకు ఎంపీ పదవి రావడానికి కూడా అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే కారణమని చెప్పారు. కష్టాలు, ఇబ్బందుల్లో ఉన్నప్పుడు అంబేద్కర్ జీవిత చరిత్ర స్ఫూర్తినిస్తుందని అన్నారు. ఆయన భావాలు, ఆలోచనలు నిత్యం అనుసరణీయమని పేర్కొన్నారు. అంబేద్కర్ అందరివాడని, దళితులు లేని గ్రామాల్లో కూడా ఆయన విగ్రహాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ స్వగ్రామం విఎన్ పురంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఢిల్లీలోని తన నివాసంలో గదులను సివిల్ సర్వీసులకు శిక్షణ పొందుతున్న పదిమంది తెలుగు విద్యార్థులకు కేటాయించడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థిని అరుంధతికి భవిష్యత్తులో అన్ని విధాల సహకారం అందిస్తామని ప్రకటించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ మాట్లాడుతూ అంబేద్కర్ గొప్పదనాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రముఖ కళాకారుడు ఆర్‌బి రామానాయుడు అంబేద్కర్ వేషధారణలో చేసిన ఏకపాత్రాభినయం ఆలోచింపజేసింది. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రామానందం, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.చిట్టిబాబు, ఎస్.రామస్వామి తదితరులు మాట్లాడారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, సంఘాలు సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అంబేద్కర్ జయంతి వేడుకల్లో నృత్యం చేస్తున్న కళాకారిణులు

అంబేద్కర్ ఆలోచనల్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

భారత రాజ్యాంగ నిర్మాత ఆలోచనల్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు అన్నారు. అంబేద్కర్ కు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలని, న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్ర వేత్తగా, రాజకీయ నేతగా చరిత్రలో అంబేద్కర్ తనదైన ముద్ర వేశారన్నారు. ఆయన ఆలోచనలను ప్రజల్లోకి తీసుకువెళ్లి. అంతా చైతన్యం దిశగా సాగడమే నిజమైన నివాళి అని అన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా అంబేద్కర్ అందరి హృదయాల్లో చిరస్మరణీయంగా నిలిచిపోయారని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ పల్లి నల్లనయ్యతో కలిసి ఆమె అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, టిపిఆర్ఒ సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎస్‌పి వకుల్ జిందాల్ పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాలకు ఆరాధ్య దైవం, దేశంలోని అన్ని వర్గాలకు ఆదర్శమూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జి.నాగేశ్వరరావు, విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావు, మహిళా పిఎస్ డిఎస్‌పి ఆర్.గోవిందరావు, మహిళా పిఎస్ సిఐ ఇ.నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విధ్వంసానికి కుట్ర

కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ● అంబేద్కర్‌కు ఘన నివాళి



శృంగవరపుకోటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, నాయకులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాజ్యాంగ విధ్వంసానికి కుట్ర చేస్తోందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ధ్వజమెత్తారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను శృంగవరపుకోట పట్టణంలో కెవిపిఎస్ ఆధ్వర్యాన సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్‌సి కాలనీ నుంచి వన్‌వే జంక్షన్, గాంధీ బొమ్మ, ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా దేవి కూడలి వరకు తీన్మార్, డిజె, మందుగుండు సామగ్రితో భారీ ర్యాలీ చేపట్టారు. మనువాదుల నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, లౌకికవాదాన్ని పరిరక్షించుకుందాం, మనువాద సిద్ధాంతాన్ని వ్యతిరేకించండి, అంబేద్కర్ ఆశయాలను కొనసాగిస్తాం, ఎస్‌సి, ఎస్‌టిలకు రక్షణగా ఉన్న చట్టాలను కాపాడుకుందాం.. అంటూ నినాదాలు చేశారు. అనంతరం దేవి కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగంపై, రాజ్యాంగ హక్కులపై దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజ్యాంగమే భారతదేశానికి ప్రథమ గ్రంథమని స్పష్టంచేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని అందరం పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కమిటీ సభ్యులు మద్దిల రమణ, శృంగవరపుకోట మేజర్ పంచాయతీ సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, దళిత నాయకులు జైశంకర్, మామిడి శంకర్, గంట శంకర్, గణేష్, ఆర్మీ గణేష్, భారతి, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడు కోవడమే నివాళి

విజయనగరంటౌన్ : ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి అని కెవిపిఎస్, ఐద్వా జిల్లా కార్యదర్శులు అర్.ఆనంద్, పి.రమణమ్మ అన్నారు. సోమవారం విజయనగరం గంజిపేటలో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... కేంద్రం లో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని అన్నారు. దేశంలో బిజెపి కులాన్ని,మతాన్ని తన స్వార్థ రాజకీయాలకు వాడుకుంటుందని విమర్శించారు. ఒక ప్రక్క అంబేద్కర్ పై తీపి కబురులు చెబుతూ ఆయన రాసిన రాజ్యాంగంపైన, దళితులు,మహిళలు,మైనార్టీలు పైన దాడులు చేస్తుందని అన్నారు. అంబేద్కర్ ఆశయాలు కోసం పని చేసినప్పుడు,రాజ్యాంగాన్ని కాపాడినప్పుడు ఆయనకు నిజమైన నివాళి ఇచ్చిన వారం అవుతామని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు వెంకటరావు, పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకులు రంభ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా వైయస్సార్ నగర్, స్టేడియం పేట, గాజుల రేగలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని కాపాడు కుంటామని ప్రతిజ్ఞ చేశారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.జగన్మోహన్రావు, బి భాస్కరరావు, మహిళా నాయకుల కుమారి, రమ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము, ఆటో యూనియన్ నాయకులు బి పాపారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు బి.కృష్ణ, డి. వైకుంఠ రాజు, బి. మోహన్ పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన నివాళి

అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు .అనంతరం ఆయన మాట్లాడుతూ మోడీ బిజెపి పాలనలో రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తున్నారని అన్నారు. ప్రజలంతా ఐక్యంగా రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ. జగన్మోహన్. కె.సురేష్, నగర కమిటీ సభ్యులు రాము, కరుణ, రంభ శ్రీనివాస్, వి.రామ చంద్రరావు, హరీష్ పాల్గొన్నారు.

నెల్లిమర్ల : మండలంలోని రామతీర్థం జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు టివి రమణ పూలమాల వేసి నివాళులర్పించారు. జరజాపుపేటలోని ఎస్‌సి కాలనీలో అంబేద్కర్ చిత్రపటానికి సిపిఎం నాయకులు కిల్లంపల్లి రామారావు ఆధ్వర్యాన పూలమాల వేసి నివాళులర్పించారు.



విజయనగరంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు

బొబ్బిలి : పట్టణంలోని పాకివీధిలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.శంకరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు జి.శంకర్రావు, జి.గౌరి, ఆదయ్య, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యాన.. టి.పి.మున్సిపల్ పాఠశాలలో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులు నాగూరు రమేష్ అధ్యక్షతన రాజ్యాంగ హక్కులు రక్షణ... విద్యారంగంపై సదస్సు నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సదస్సులో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి మాట్లాడుతూ రాజ్యాంగం అతి పెద్ద ప్రమాదంలో పడబోతోందని, రాజ్యాంగ మౌలిక సూత్రాలను కాలరాసే చట్టాలు, చర్యలు తీసుకొస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అందులో జాతీయ నూతన విద్యా విధానం ఒకటని చెప్పారు. దీన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. మీసాల గౌరు నాయుడు అంబేద్కర్‌పై రచించిన గేయాన్ని పాడి వినిపించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, నాయకులు పి.మధుసూధనరావు, కేశవరావు, ఆనెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : ఉత్తరాపల్లి పంచాయతీ గాంధీనగర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జి.అప్పారావు, వ్యవసాయ కార్మికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.







కొత్తవలస, బొబ్బిలి, నెల్లిమర్లలో అంబేద్కర్ విగ్రహాలు, చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు



మాట్లాడుతున్న బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహారావు

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని
24న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు

బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహారావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భవన నిర్మాణ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ముఖ్యమంత్రి భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఈ నెల 24న రాష్ట్రంలో అన్ని జిల్లా కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్‌వి నర్సింహారావు తెలిపారు. సోమవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉంటామని చెప్పి, అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమబోర్డును పురుద్ధరిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబునాయుడు పది నెలలు కావస్తున్నా సంక్షేమ బోర్డు పునరుద్ధరించకపోవడం అన్యాయమన్నారు. సంక్షేమ బోర్డులో రూ.4293 కోట్లు నిధులు ఉన్నాయని, ఆ నిధులతో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతున్నామన్నారు. వెంటనే సంక్షేమ బోర్డును పురుద్ధరించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.రమణ, నాయకులు బి.సత్యం, కె.సంతోష్ కుమార్, అర్.సతీష్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన డిఎస్‌పి



ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మహిళా పోలీసుస్టేషను డిఎస్‌పిగా ఆర్.గోవిందరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్‌పి వకుల్ జిందాల్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, పూలమొక్కను అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి డిఎస్‌పిని అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. మహిళల ఫిర్యాదుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని సూచించారు.



నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు, ఉపాధి కూలీలు

ఒకపూటే ఉపాధి పనులు పెట్టాలి

సిపిఎం మండల కార్యదర్శి సురేష్

ప్రజాశక్తి-బాడంగి

ఉపాధి పనులు రెండు పూటలా పెట్టొద్దని, ఒకపూటే పెట్టాలని సిపిఎం మండల కార్యదర్శి సురేష్.. అధికారులను డిమాండ్‌చేశారు. మండలంలో బొత్సవానివలసలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం కూలీలతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రంగా ఉండడంతో కూలీలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రెండు పూటలా పనిచేసినా సరే సక్రమంగా బిల్లులు పడే పరిస్థితి లేదన్నారు. కూలి గిట్టుబాటయ్యే చూసి, పని ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

16న పెదమేడపల్లిలో నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని పెదమేడపల్లి గ్రామంలో సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి రేవంత్ ఒక ప్రకటనలో తెలిపారు. కంటి సంబంధిత సమస్య ఉన్నవారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు చెప్పారు.



ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దొన్నుదొరకు వినతి అందిస్తున్న రిక్కి అప్పారావు

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

విశాఖపట్నం నుంచి వేపాడకు నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు.. ఆర్‌టిసి జోనల్ చైర్మన్ దొన్ను దొరకు సోమవారం వినతి అందించారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో ఆయన్ను కలిసి సమస్యను వివరించారు. వేపాడ మండల కేంద్రానికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విశాఖ కెజిహెచ్‌లో వైద్య సేవలకు రోగులు, రోజువారి కూలి పనికి, పరిశ్రమలకు వెళ్లడానికి కార్మికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆటోలో వెళ్లి రావడం ఆర్థికంగా భారమవుతుందని తెలిపారు. అత్యవసర సేవలు పొందలేక కొన్ని సందర్భాలలో ప్రాణాలు కోల్పోయిన సంఘటన కూడా ఉన్నాయని వివరించారు. మానవతా దృక్పథంతో విశాఖపట్నం ద్వారకానగర్ బస్టాండ్ నుంచి కొత్తవలస, సోంపురం, సింగరాయి జంక్షన్ మీదుగా వేపాడ మండల కేంద్రానికి నైట్‌హాల్ట్ బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తిచేశారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

కొండవెలగాడ, రామతీర్థం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని విజయనగరం టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కొండ వెలగాడ సబ్ స్టేషన్ 33/11 కెవి ఎస్ఎస్‌హెచ్ క్యూ ఫీడర్, పారసాం రూరల్ ఫీడర్ వ్యవసాయ కనెక్షన్ నిర్మాణం, పనుల పొడిగింపు, చెట్లు తొలగించడం, సాంకేతిక సమస్యలు పరిష్కారం కోసం విద్యుత్తును నిలుపుదల చేస్తామన్నారు. దీంతో సబ్ స్టేషన్ పరిధిలో కొండవెలగాడ, చంద్రంపేట, ఎల్ఎన్‌పురం, తాళ్లపూడి పేట, టెక్కలి, తుమ్మలపేట, చినబూరాడపేట, పెదబూరాడపేట పారసాం, గెద్దపేట, గుర్ల మండలం భూపాలపురం, ఆనందపురం గ్రామాల్లో మంగళవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. సతివాడ 11కెవి సబ్ స్టేషన్ పరిధిలో మాల్యాడ, వెంకన్న పాలెం గ్రామాలకు 10గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని చాలని ఆయన కోరారు.

అనాథలకు కర్బూజా పంపిణీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా సోమవారం తండుడుబిల్లి గణిత ఉపాధ్యాయులు శివకు బంగారయ్య రామలక్ష్మి దంపతులు విజయనగరం ఎల్బీ కాలనీలో రెయిన్ బో అనాధాశ్రమంలో 75 మంది పిల్లలకు సరిపడా కర్బూజా ఫలాలను పపిణీ చేశారు. ఈ సందర్భంగా వారికి పిల్లలు ధన్యవాదాలు తెలిపారు.

వైభవంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కెఆర్‌పేట పంచాయతీ పరిధిలోని అంకాజోష్యులపాలెంలో గ్రామదేవత మరిడిమాంబ పండగ సోమవారం వైభవంగా ప్రారంభమైంది. తొలిరోజు తొలేళ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఘటాలను గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భారీగా మహిళలు పాల్గొని, పూజలు చేశారు. మంగళవారం అనుపోత్సవం నిర్వహించనున్నారు. పండగ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ సహకారంతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఎట్టకేలకు మెట్లు ఏర్పాటు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ఎల్లంకి వీధికి వెళ్లేందుకు ఎట్టకేలకు మెట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల ప్రధాన రహదారి విస్తరణ అభివృద్ధి పనుల్లో భాగంగా ఎల్లంకి వీధి వైపు కాలువ ఎత్తుగా కట్టి వేయడంతో రాకపోకలు సాగించేందుకు ఈ వీధి వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధిలో ఎవరూ మృతి చెందిన అంతిమయాత్రకు తరలించేందుకు వీధి ఇరుగ్గా ఉండడంతో పాటు రహదారి మధ్యలో కాలువ నిర్మించడంతో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తుందని వీధి వాసులు ఆరోపించారు. పొరపాటున అడుగుతప్పిన కాలువలో పడిపోవాల్సిందే మేజర్ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనుల్లో భాగంగా వీధికి మెట్లు ఏర్పాటు చేయడంతో స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

తాగునీరు వృథా

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండవ ఉపరితల రక్షిత మంచినీటి పథకం ద్వారా సరఫరా చేస్తున్న తాగునీరు వృథాగా పోతుంది. సిఎస్‌ఆర్‌పేట-చిదిమి గ్రామాల మధ్య ప్రధాన పైపు లైను లీకు కావడంతో తాగునీరు అంతా వృథాగా పంట పొలాల్లోకి వెళ్లిపోతుంది. ఈ కారణంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అరకొర నీరు సరఫరా అవుతుంది.

ఘనంగా అంబేద్కర్‌కు నివాళి



అశోక్‌బంగ్లాలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్‌పి, అశోక్‌గజపతిరాజు



బొబ్బిలిలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు



చీపురుపల్లిలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్‌పి బెల్లాన, వైసిపి నాయకులు









డెంకాడ, జామి, రాజాం, కొత్తవలసలో అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎమ్మెల్యేలు కోళ్ల లలితకుమారి, కోండ్రు మురళీమోహన్, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నాయకులు



వేపాడలో నివాళులర్పిస్తున్న ఎంపిపి సత్యవంతుడు



గంట్యాడలో నివాళులర్పిస్తున్న అధికారులు



గజపతినగరంలో నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఉద్యోగాలు వచ్చే వరకూ పోరాడాలి

• 17న డిఎస్‌సి అభ్యర్థుల అవగాహన సదస్సు • జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



డిఎస్‌సి నోటిఫికేషన్‌తో పాటు ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చే వరకు పోరాడాలని నిరుద్యోగులకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము పిలుపునిచ్చారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఈనెల 17న జరగబోయే డిఎస్‌సి అవగాహన సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యాన సోమవారం కోట వద్ద అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు డి.రాము మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి హోదాలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఫైల్‌పై మొదటి సంతకం పెట్టి అభ్యర్థులను మోసం చేశారని ఆరోపించారు. పది నెలలు గడిచిన మొదటి సంతకాన్ని అమలు చేసే దిక్కు లేదని అన్నారు. త్వరలోనే మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పలుమార్లు ప్రకటించినా అమలు కాలేదన్నారు. వెంటనే మెగా డిఎస్‌సి నిర్వహించాలని పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈనేపథ్యంలో ఈనెల 17న గురజాడ గ్రంథాలయంలో నిర్వహించే అవగాహన సదస్సుకు అభ్యర్థులంతా హాజరు కావాలని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ హరీష్ మాట్లాడుతూ ఉద్యోగం వచ్చేంతవరకు కూడా ఒకవైపు చదువుతూ మరోవైపు పోరాటానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. అలాగే 17వ తేదీన జరగబోతున్న సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి విఆర్ఎల వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అంబేద్కర్ విగ్రహానికి విఆర్ఎల సంఘం ఆధ్వర్యంలో నాయకులు వినతి అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, విఆర్ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గురుమూర్తి మాట్లాడుతూ కేవలం 10,500 జీతంతో విఆర్ఎలు కుటుంబాలను పోషించుకోలేక పస్తులతో బతుకుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి విఆర్ఎలకు వేతనాలు పెంపుదలతో పాటు ఇతర సమస్యలు కూడా పరిష్కరించేలా మీ ద్వారా ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని కోరారు. తెలంగాణాలో మాదిరి విఆర్ఎలకు పే స్కేల్ అమలు చేసి రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, నామినీలను విఆర్ఎలుగా గుర్తించాలని, నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, అర్హులైన విఆర్ఎ లందరికీ ప్రమోషన్ కల్పించాలని, ఖాళీగా ఉన్న విఆర్ఎ పోస్టులు భర్తీ చేయాలనీ, భూసర్వేలు సందర్భంగా టిఎ, డిఎలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఎలు, కెనప్రసాద్, పెడిరాజు, సన్యాసప్పుడు, రామప్పుడు, జయరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతి అందిస్తున్న విఆర్ఎలు

అంబేద్కర్ విగ్రహానికి వినతి

చీపురుపల్లి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చీపురుపల్లి మండల విఆర్ఎలు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రూ.26 వేలు కనీస వేతనం ఇవ్వాలన్నారు. డిఎని జీతంతో కలిపి ఇవ్వాలని, నామినేలను విఆర్ఎలుగా గుర్తించాలని అన్నారు. నైట్ డ్యూటీలు రద్దుచేసి విఆర్ఎలకు ప్రమోషన్స్‌ను కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న విఆర్ఎ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలన్నారు. వీరికి చీపురుపల్లి బహుజన్ సమాజ్‌వాది పార్టీ నాయకులు సబ్బి సత్యనారాయణ తదితరులు మద్దతు తెలిపారు.

ఆ స్థలాన్ని వేరొకరికి ఎలా ఇస్తారు?

వైసిపి నాయకులు

ప్రజాశక్తి - భోగాపురం

గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి తమ ఆధీనంలో ఉన్న స్థలాన్ని వేరొకరికి ఇచ్చేందుకు అధికార పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని ఆ స్థలాన్ని వేరొకరికి ఎలా ఇస్తారని చెరుకుపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు గుజ్జు వెంకటరమణ విమర్శించారు. గ్రామంలోని వైసిపి నాయకులతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టిడిపి ప్రభుత్వం హయాంలో సుమారు 70 మందికి గ్రామంలో పట్టాలు ఇచ్చారని అయితే వారికి అప్పుడు స్థలాలు చూపించలేదని అన్నారు. అందులో కొంతమంది హైకోర్టును ఆశ్రయించడంతో వారికి స్థలాలు చూపించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించిందన్నారు. దీంతో గ్రామంలో జగనన్న కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో హైకోర్టు ఆదేశాలు మేరకు స్థలాలు ఇచ్చారన్నారు. ఇటీవల మరో 12 మంది కూడా హైకోర్టును ఆశ్రయించడంతో వారికి స్థలాలు చూపించాలని కోర్టు ఆదేశించిందని దీంతో తాము 30 ఏళ్లగా ఉంటున్న స్థలంలో వారికి స్థలాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. గ్రామంలో జగనన్న కాలనీ సమీపంలో గతంలో హైకోర్టు ఆశ్రయించిన వారికి ఇచ్చిన స్థలాలు పక్కనే సుమారు 25 స్థలాలు లే అవుట్ వేసి ఉందన్నారు. అధికారులు అక్కడ ఇస్తామని చెబుతున్నప్పటికీ కావాలనే తమ స్థలం ఇవ్వాలని అడగడం దారుణమన్నారు. గ్రామ సర్పంచ్ భర్త రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కల్పించేందుకే అధికార పార్టీ నాయకులు ఇలాంటి పనులు చేస్తున్నారన్నారు. ఆ 12 మందికి గ్రామంలో వేరేచోట స్థలం ఇస్తామన్నా సరే కావాలని గుజ్జు రమణ స్థలాన్ని అడగడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సరగడ రమేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆక్రమణలు చేసిన స్థలాల్లోనే ఎన్నో ఏళ్ల నుంచి ఉంటున్నారన్నారు. గ్రామంలో ఇంకా చాలా స్థలాలు ఖాళీగానే ఉన్నాయని, కావాలంటే అక్కడ ఇచ్చుకుంటే ఎటువంటి ఇబ్బందీ లేదని అన్నారు. అనంతరం 12 మందికి పట్టాలిచ్చేందుకు ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని వారంతా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాయి ఈశ్వరరావు, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

ప్రభుత్వ ఆదాయానికి అక్రమార్కుల గండి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని మట్టి, కంకర తవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. గ్రామాల్లోని చెరువుల్లో ఎక్కడికక్కడ అక్రమంగా తవ్వకాలు చేపడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏ విధమైన అనుమతులూ లేకుండా కళ్లాలకు, పొలాలకు అంటూ పగలూ రాత్రి తేడా లేకుండా మట్టి, కంకర తరలించుకుపోతున్నారు. దర్జాగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఈ విషయమై రెవెన్యూ అధికారులను అడిగితే తమకు సంబంధం లేదంటున్నారు. ఇరిగేషన్ శాఖదే ఆ బాధ్యతని తప్పించుకుంటున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు అందుబాటులో ఉండటం లేదు. మరోవైపు చెరువుల్లో ప్రమాదకరంగా గోతులు తవ్వడం వల్ల వర్షాకాలంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ఆయా గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మట్టి, కంకర అక్రమ రవాణాపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆదాయానికి యథేచ్ఛగా గండి కొడుతున్నా పట్టించుకోక పోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ట్రాక్టర్‌కు మట్టి లోడ్ చేస్తున్న జెసిబి



ధనంజయ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

నిందితుడిపై కఠిన చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బొబ్బిలి

హత్యాయత్నానికి గురై బొబ్బిలి సిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న జనసేన నాయకుడు మహంతి ధనంజయ్‌ను సోమవారం ఎమ్మెల్యే బేబినాయన పరామర్శించారు. సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చూస్తానని హామీ ఇచ్చారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాబు పాలూరి డిమాండ్ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధనంజయ్‌ను పరామర్శించారు. ఆక్రమణలపై పోరాటం చేస్తే హత్యాయత్నానికి పాల్పడటం దుర్మార్గమన్నారు. తక్షణమే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

కబ్జాపై ప్రశ్నిస్తే దాడులు చేయడం అన్యాయం

కబ్జాపై ప్రశ్నించిన జనసేన నాయకులు ధనంజయ్‌పై దాడి చేయడం అన్యాయమని పిసిసి సభ్యులు ముվ్వల శ్రీనివాసరావు అన్నారు. హత్యాయత్నానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విజయనగరంటౌన్ : ప్రభుత్వ స్థలం ఆక్రమణ పై ఫిర్యాదు చేసినందుకు ధనంజయపై కత్తితో దాడి చేయడం దారుణమని జనసేన నేత గురాన అయ్యలు అన్నారు. ధనంజయ్‌ను సోమవారం అయ్యలు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధనంజయపై దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు. జనసేన కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో జన సేన నాయకులు ఆదాడమోహన్ రావు, రాజేంద్ర , ఎంటి రాజేష్ , పిడుగు సతీష్, ఎమ్. పవన్ కుమార్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డిబిఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. చిట్టిబాబు

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాలి

ప్రజాశక్తి -పూసపాటి రేగ

భారత రాజ్యాంగ పరిరక్షణే అంబేద్కర్ కు నివాళి అని దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి చిట్టిబాబు అన్నారు. ఆయన ఆశయాలు సాధించాలంటే రాజ్యాంగం స్ఫూర్తిని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా కెవిపిఎస్ నాయకులు తాలాడ బుజ్జిబాబు అధ్యక్షతన పేరాపురం గ్రామంలో సోమవారం సభ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన చిట్టిబాబు మాట్లాడుతూ వివక్షత లేని సమాజం భారత రాజ్యాంగం ద్వారా సాధించాలని అంబేద్కర్ ఆశించారని, కానీ నేటికీ అంటరానితనం , అసమానతలు, కుల వివక్షత , మతోన్మాదం, ఆహారంపై ఆంక్షలు వంటి ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలు చూస్తుంటే భారత ప్రజానీకాన్ని ఆందోళనకు గురి చేస్తున్నాయని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని లౌకిక వాదాన్ని స్ఫూర్తిని తుంగలోనికి తొక్కుతోందన్నారు. డాక్టర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ మహిళల హక్కులు కోసం కృషి చేశారని, రాజ్యాంగంలో వారికి ప్రత్యేక హక్కులు కల్పించారని తెలిపారపు. పూసపాటిరేగ ఎస్ఐ ఐ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అంటరానితనాన్ని రూపు మాపేందుకు అంబేద్కర్ పోరాడారని అన్నారు. సిఐటియు నాయకులు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి బిజెపి ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని అన్నారు. స్థానిక సర్పంచ్ రౌత్ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ నేటి యువతకు అంబేద్కర్ జీవితం ఆదర్శం కావాలన్నారు. అనంతరం ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కమిటీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, రాజ్యాంగ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో పేరాపురం ఎపిటిసి పతివాడ తమ్ము నాయుడు, పూసపాటిరేగ సర్పంచ్ సీతారాములు, పేరాపురం మాజీ సర్పంచ్ బొంతు ఉమ, వైసిపి నాయక(లు కోరాడ మహేష్, జనసేన నాయక(లు బోర సతీష్, యువజన సంఘం నాయకులు తాలాడ కృష్ణ, మురళి, గణేష్, తవుడు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

విజయనగరం జిల్లా, విజయనగరం బస్తీ డాబా గార్డెన్స్ కాపరస్తులు వంకాయల వెంకటరాజు గారి కుమారుడు వంకాయల రామలింగేశ్వరరావు గాజులరేగలోని ఖాళీ స్థలం విజయనగరం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో 1వ పుస్తకం దస్తావేజు నెం.1362/2005ను విజయనగరం బస్తీ, బొడ్డువారి జంక్షన్‌కు చెందిన గోకవరపు సరయ్య కుమారుడు గోకవరపు పైడిశెట్టి కొనుక్కున్నారు. ఆ స్థలం డాక్యుమెంటు ఎక్కడో పోయినది. పోలీసులు స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం జరిగింది. ఆ డాక్యుమెంట్ ఎవ్వరికీ ఎటువంటి ఉపయోగం లేనందున దొరికిన వారు ఈ నెంబర్‌కు 9440192410కు సమాచారం ఇవ్వాలని ప్రస్తుతం యజమాని గోకవరపు పైడిశెట్టి కోరారు.